సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే శ్రీగణేష్


పికెట్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానిస్తున్న మహిళలు

రసూల్‌పురా: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా లక్ష గ్యాలన్ల తాగునీటి సరఫరాకు ఎమ్మెల్యే కృషి చేయడంతో రెండో వార్డుకు చెందిన మహిళలు కాంగ్రెస్ నాయకులు శాంసన్‌రాజు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ మెట్రో వాటర్‌వర్క్స్ అధికారులు అదనంగా విడుదల చేస్తున్న తాగునీటి కారణంగా ఇకపై బస్తీవాసులకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రెండవ వార్డు నాయకులు యాదగిరి, ఏండి గౌస్, నాగరాజు, అస్గర్, అన్నానగర్ మురళి, నగేష్, సరోజ, మహేశ్వరి, అయిషా బేగం పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయండి


తలసానికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

సనత్‌నగర్: ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేసేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఆశా వర్కర్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉమాదేవి, విజయలక్ష్మీ, శశికళ, మానస, మమత, ధన తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: పాటిగడ్డ, కిమ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కిమ్స్ ప్రధాన రహదారి ప్రాంతం
- మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు భరణి కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని భరణి కాంప్లెక్స్, సింధీకాలనీ నాలా, ఎంజీ శ్యామ్, అశోకా భూపాల్ చాంబర్స్, సురభి కాంప్లెక్స్, అశోకా బిల్డర్స్ ప్రాంతాల్లో..
- మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కృష్ణానగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్, బాపూబాగ్ గ్రీన్ గేట్, ప్రశాంత్ అపార్ట్‌మెంట్స్, హరినివాస్, హనుమాన్ దేవాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సెన్సర్ @ సిగ్నల్

సికింద్రాబాద్‌లో ప్రయోగాత్మకంగా అమలు

- వెహికల్ అడాప్టివ్ కంట్రోలర్ సిస్టమ్ ఏర్పాటు
- వాహనదారుల నిరీక్షణకు ట్రాఫిక్ పోలీసుల చెక్


బైబిల్ హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ సెన్సర్

బన్సీలాల్‌పేట్: ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన చౌరస్తాల్లో ఆధునిక వెహికల్ అడాప్టివ్ కంట్రోలర్ సిస్టమ్ (వీఏసీ)లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను సులభతరం చేయనున్నారు. తొలుత రద్దీ చౌరస్తాలను గుర్తించి ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహన చోదకులు గ్రీన్ సిగ్నల్ పడే వరకు వేచి ఉండే అవసరం లేకుండా ఈ నూతన విధానం దోహదపడనుంది. మొదట ప్రయోగాత్మకంగా మహంకాళి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు చౌరస్తాల్లో సెన్సర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఇలా పనిచేస్తుంది..

చౌరస్తాల్లో రెడ్‌లైట్ పడగానే వాహన చోదకులు ఆగిపోతారు. గ్రీన్ సిగ్నల్ పడేంత వరకు నిరీక్షిస్తుంటారు. అయితే ఈ కొత్త విధానం ద్వారా అటువైపు గ్రీన్ సిగ్నల్ పడి వాహనాల రాకపోకలు లేకుండా రోడ్డు ఖాళీగా ఉంటే ఇటువైపు గ్రీన్ సిగ్నల్ పడుతుంది. ఇలా సెన్సర్ విధానంతో అటువైపు వాహనాల రాకపోకలు లేకుండా రోడ్డు ఖాళీ అయిన వెంటనే రెడ్ సిగ్నల్ పడుతుంది. అంటే రద్దీ వాహనాలున్న రోడ్డుపై వెంటనే గ్రీన్ సిగ్నల్ పడుతుంది. దీని ద్వారా వాహన చోదకులు ఎక్కువ సమయం నిరీక్షించకుండా ముందుకు సాగే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చారు ట్రాఫిక్ పోలీసులు.

తొలుత ఏ చౌరస్తాల్లో అంటే..

ఆర్పీ రోడ్డులోని బైబిల్ హౌస్, కర్బలా మైదాన్, సిటీలైట్ చౌరస్తా, రాణిగంజ్ చౌరస్తాలో వెహికల్ అడాప్టివ్ కంట్రోలర్ సిస్టమ్ (వీఏసీ) విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇక్కడ విజయవంతమైతే మరిన్ని ప్రాంతాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులువు



సిగ్నల్ సెన్సర్ విధానం ద్వారా ట్రాఫిక్ సమస్యలను కొంత వరకు అరికట్టవచ్చు. ఈ విధానం వల్ల చౌరస్తాల్లోని సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీని నివారించడానికి వీలవుతుంది. వాహన చోదకులకు ఎంతో వెసులుబాటు ఉంటుంది.

– ఉప శంకర్, మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్

విద్యార్థులకు బాధ్యతల అప్పగింత


మడ్‌ఫోర్ట్ పాఠశాలలో ఇన్వెస్టిచర్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రసూల్‌పురా: విద్యార్థుల ప్రవర్తన పాఠశాల విధుల పట్ల బాధ్యతాయుతంతో పాటు సమాజంలో వారి పాత్ర సరైన మార్గంలో ఉండాలని మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐరీన్ సుప్రద అన్నారు. శనివారం పాఠశాలలో ఇన్వెస్టిచర్ వేడుకల్లో భాగంగా అబ్దుల్ కలామ్, కల్పన చావ్లా, రామానుజం, వివేకానంద పేర్లతో హౌస్‌లుగా విభజించి ఎన్నికైన విద్యార్థులకు అధికారాలు అప్పగించారు. కార్యక్రమంలో పీఈటీ వినయ్ ఉపాధ్యా యులు గణేష్, శ్రీలత, విజయలక్ష్మి, పద్మజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సాహం

చిలకలగూడ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో సికింద్రాబాద్ బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో సీతాఫల్‌మండి చౌరస్తా శనివారం సాయంత్రం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుతు నృత్యాలు చేస్తూ విజయోత్సవ వేడుకలు సందడిగా జరుపుకున్నారు. సికింద్రాబాద్ మహంకాళి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాల అందజేత

సనత్‌నగర్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేశారు. మోండా డివిజన్ నాలా బజార్‌కు చెందిన లావణ్యకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు మంజూరు కాగా, ఆమె భర్త సంపత్‌కు శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్‌ఓసీని అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

● సత్తా చాటిన 18 పాఠశాలల విద్యార్థులు


పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కంజర్ల శంకర్‌యాదవ్ స్మారక అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. పోటీలలో పాల్గొన్న వివిధ వివిధ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో నగరంలోని 18 పాఠశాలలకు చెందిన విద్యార్థులు తలపడ్డారు. ఉత్కంఠభరితంగా జరిగిన బాలుర బాస్కెట్‌బాల్ ఫైనల్ పోటీల్లో హిందూ పబ్లిక్ స్కూల్ జట్టు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో లిటిల్ స్కాలర్ స్కూల్ జట్టు విజయం సాధించాయి. టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాలుర సింగిల్స్‌లో వికాస్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి శ్రీపాల్, బాలికల సింగిల్స్‌లో వికాస్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని ప్రగతి విజేతలుగా నిలిచారు. టేబుల్ టెన్నిస్ బాలుర డబుల్స్ పోటీల్లో విజేతలుగా రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య శ్రీసాయి, లోహన్‌లు, బాలికల డబుల్స్‌లో వికాస్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు కోటేశ్వర లిఖిత, ప్రగతిలు గెలుపొందారు. విజేత జట్లకు, క్రీడాకారులకు స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక, ట్రస్ట్ ప్రతినిధులు ట్రోఫీలు, బహుమతులను ప్రదానం చేశారు.

సందడిగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్



సనత్‌నగర్: బేగంపేటలోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా (సీఏఐ) హోటల్ మేనేజ్‌మెంట్‌లో కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులతో పాటు పలువురు హోటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొని కేక్‌కు అవసరమైన సుగంధద్రవ్యాలు, డ్రైఫ్రూట్స్‌ను మిక్స్ చేశారు. 55 కిలోల వివిధ రకాలైన డ్రైఫ్రూట్స్‌తో పాటు వైన్స్ కలిపిన మిశ్రమంతో తయారుచేసిన కేక్‌ను నెల రోజుల పాటు ఉంచి క్రిస్మస్ ముందు, తర్వాత వీటిని పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సనత్‌నగర్: రవీంద్రనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పటల్ వైద్యులు వెద్య సేవలు అందించారు. శిబిరంలో దాదాపు 200 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. హాస్పటల్ సీఎంఓ డాక్టర్ నిరంజని, ఎస్ఎంఓ డాక్టర్ వల్య, ఎంఓ డాక్టర్ వసీం పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిన కృష్ణయ్య

చిలకలగూడ : రైల్వే ట్రేడ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైల్ నిలయం బ్రాంచ్ సంఘ్ చైర్మన్ కృష్ణయ్య, సభ్యురాలు హారతిలు ప్రాథమిక సభ్యత్వంతోపాటు తమ పదవులకు రాజీనామా చేసి మజ్దూర్ యూనియన్‌లో చేరారు. మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈడీబీ డివిజన్ కమిటీ నేతృత్వంలో జనరల్ సెక్రటరీ శంకరరావు సమక్షంలో కృష్ణయ్య, హారతిలు మజ్దూర్ యూనియన్‌లో చేరారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసికున్నారు. ఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన మేరకు.. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని గేట్ నెంబర్ 4 టికెట్ కౌంటర్ ముందు మహిళ అపస్మారక స్థితిలో పడివుందని స్థానికులు సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా ఆమె అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురికీ తరలించారు.

విద్యార్థి అదృశ్యం


శ్రీధర్ (ఫైల్)

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన మేరకు..సనత్‌నగర్ అశోక్‌కాలనీకి చెందిన సచిన్ కుమారుడు శ్రీధర్(14) స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శ్రీధర్ ఆచూకీ కోసం వెతికినా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని సనత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెస్ట్


హెల్త్ ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో చిన్నారులు రూపొందించిన నమూనాలు

సనత్‌నగర్: ఆరోగ్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ చిన్నారులు ప్రదర్శించిన వైజ్ఞానిక నమూనాలు అందరినీ ఆలోచింపజేశాయి. చిట్టిపొట్టి చిన్నారులు వినూత్న ప్రాజెక్టులు రూపొందించి ఆకట్టుకున్నారు. ఎస్సార్‌నగర్‌లోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ (ఏహెచ్‌పీఎస్)లో శనివారం సైన్స్‌ఫెస్ట్–2024 ఉత్సాహంగా జరిగింది. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై వివిధ రకాల ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఇందులతరెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ్ కక్కర్ పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

లాలాపేట: మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో తార్నాక మున్సిపల్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం తార్నాకలో మాజీ మేయర్ నివాసం వద్ద పటాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీసమర్థవంతమైన నాయకత్వం, అభివృద్ధికి మహారాష్ట్ర ప్రజలు కనివిని ఎరుగని రీతిలో భారీ మెజార్టీతో పట్టం కట్టారని ఈ సందర్భంగా మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, కనకట్ల హరి, రవిప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పూసల కులానికి సముచిత స్థానం కల్పించాలి

లాలాపేట: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో పూసల కులానికి సముచిత స్థానాన్ని కల్పించాలని హైకోర్టు న్యాయవాది, పూసల సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ గుండ్లపల్లి సత్యానారాయణ బీసీ కమీషన్‌ను కోరారు. శనివారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బీసీ కమీషన్ ముందు సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘం తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకటేశం, ఉపాధ్యక్షులు పసుపులేటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిజం అధ్యాపకుడికి ఓయూ డాక్టరేట్


డాక్టర్ కృష్ణకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: జర్నలిజం అధ్యాపకులు గుంటి కృష్ణకుమార్‌కు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. డా.బీఆర్ అంబేద్కర్ డిగ్రీ, పీజీ కాలేజీలో అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని మాస్ కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం విశ్రాంత ప్రొ.శ్యాంసుందర్ పర్యవేక్షణలో పబ్లిక్ పర్సెప్షన్స్ ఆన్ పోలీసింగ్, లా అండ్ ఆర్డర్ యన్ ఎక్స్‌ప్లొరేటరీ స్టడీ ఆన్ రోల్ ఆఫ్ మీడియా ఇన్ హైదరాబాద్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది.

అంతర్జాతీయ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్


ప్రొ.రాజేష్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: వియత్నాంలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ హాజరు కానున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ప్రొ.రాజేష్ కుమార్ వియత్నాం దేశంలోని హో ఛీ మిన్ సిటీలో ఈ నెల 24, 25 తేదీలలో జరిగే అంతర్జాతీయ సదస్సులో ఫిజికల్ ఎక్సర్‌సైజ్ ఫర్ హెల్దీ లివింగ్ అనే అంశం పై ప్రసంగించనున్నారు.

వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజీలో వివిధ వృత్తి కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పదవ తరగతి అర్హతతో ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్సు), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ విద్యార్హతతో రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ, పర్ఫ్యూజన్ టెక్నీషియన్లు, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్‌ల్యాబ్, పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

ప్రజలను భాగస్వాములు చేయాలి

రసూల్‌పురా: దేవాలయాల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేస్తూ దేవాలయాలను కాపాడుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. గాయత్రి గార్డెన్‌లో దేవాలయాల కమిటీ సభ్యులతో బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ రష్మీ పెరుమాళ్, అదనపు డీసీపీ అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బేగంపేట ఏసీపీ గోపాల్ కృష్ణమూర్తి, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, తిరుమలగిరి ఏసీపీ రమేష్, వివిధ పీఎస్‌ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, సిబ్బంది వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో మందులు ఇవ్వాలి

గాంధీఆస్పత్రి : తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరుపేద రోగులకు అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో ఇవ్వాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్), ప్రగతిశీల మహిళ సంఘం (పీఓడబ్ల్యు)ప్రతినిధులు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో శనివారం సర్వే నిర్వహించి, రోగుల అభిప్రాయాలను సేకరించారు. గాంధీ ఆస్పత్రిలో కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారని, మిగిలినవి ప్రైవేటు మెడికల్ షాపులో కొనుగోలు చేస్తున్నామని పలువురు రోగులు తమ దృష్టికి తెచ్చారని, మందుల కొరతపై గాంధీ సూపరింటెండెంట్‌ను కలిసి ఆరా తీసినట్లు తెలిపారు. మందుల కొరతపై రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్వే నిర్వహించి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్యమంత్రి, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిరుపేద రోగులకు అన్నిరకాల మందులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, స్వరూప, సంఘ ప్రతినిధులు బీఎస్ కృష్ణ, లక్ష్మీబాయి,శ్రీనివాస్, దేవరాజ్‌లు పాల్గొన్నారు.



సందడి చేసిన చిన్నారులు

రాంగోపాల్‌పేట్: హస్మత్‌పేట్ సాయి మోడల్ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ అనురాగ్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్ కొండల్‌రావు, జలమండలి సీజీఎం శ్రీధర్‌రెడ్డి ప్రిన్సిపాల్ విజయారెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పెండింగ్ పనులు పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ఖబరస్థాన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని తహ్రీక్ ముస్లిం ఖబరస్థాన్ కమిటీ ప్రతినిధులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. కమిటీ అధ్యక్షుడు సలీంఖాన్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఖబరస్థాన్‌లో అవసరమైన అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

పవర్‌బోర్ పనులు ప్రారంభం

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్ గోకుల్ అపార్టుమెంట్ వెనుకవైపు పవర్ బోర్ పనులను శనివారం కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

లాలాపేట: లాలాపేటలోని విద్యామందిర్ హైస్కూల్ ఆధ్వర్యంలో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది దాదాపు 600 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యామందిర్ స్కూల్ ప్రిన్సిపాల్ రీనా మాధురీ, వైస్ ప్రిన్సిపాల్ షారోన్ ప్రియదర్శిణి, రత్నాకర్, ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ సభను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 25న మహబుబాబాద్ (మానుకోట)లో జరిగే సభలో పాల్గొంటే అడ్డుకుంటామని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ హెచ్చరించారు. శనివారం ఓయూలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోలేదన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన సంఘటను రాజకీయంగా వాడుకునేందుకు గిరిజనులు అధికంగా ఉండే ఈ ప్రాంతలో ఆందోళనకు శ్రీకారం చుట్టారని విమర్శించారు.